క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా మల్లికార్జున సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. విగ్రహ మండపాల వద్ద ఎలాంటి ఘటనలు తావులేకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. విగ్రహాలు ఏర్పాటుచేసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు.

యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారు



పాములపాడు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

పాములపాడు: యూరియా అక్రమంగా నిల్వ చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు సోమవారం స్థానిక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లకు వినతి పత్రం అందజేశారు.

పందుల నుంచి పంటలను కాపాడాలి..

జూపాడుబంగ్లా: పందుల నుంచి పంటలను కాపాడాలని జూపాడుబంగ్లాకు చెందిన రైతులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులను కోరారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తదితరులు పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

నేటితో గడువు పూర్తి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ జిల్లా అధికారి రాముడు

నందికొట్కూరు: బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు మంగళవారంతో గడువు ముగియనుందని ప్రొహిబిషన్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి రాముడు తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 21 బార్ అండ్ రెస్టారెంట్‌లకు గాను 78 దరఖాస్తులు అందాయన్నారు. నందికొట్కూరు బార్ అండ్ రెస్టారెంట్‌కు ఒక దరఖాస్తు కూడా రాలేదన్నారు. నూతన బార్ పాలసీ విధానంలో ఎటువంటి మార్పులు, రాయితీలు ఇవ్వలేదన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు ఒలంపియాడ్‌లో పోటీపడాలి



పోటీ పరీక్షలను పర్యవేక్షిస్తున్న సుస్మిత

శ్రీశైలం ప్రాజెక్టు: గిరిజన విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో పోటీ పడాలని జైభీం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడిగా సుస్మిత సూచించారు. సోమవారం మధ్యాహ్నం శ్రీశైలం ప్రాజెక్టులోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థుల మేధోశక్తి పరీక్షించడానికి పోటీ పరీక్ష నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు రమేష్ మామిడాల రాసిన లైఫ్ ఆఫ్ స్టూడెంట్ పుస్తకాలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కే.వెంకట శివకుమార్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించి పూజలు చేశారు. అనంతరం పల్లకీలో కొలువుంచి మేళతాళాల మధ్య ఉత్సవాన్ని నిర్వహించారు.

అధికారుల హడావుడి!

రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారుల హడావుడి తప్ప అన్నదాతలకు యూరియా అందడం లేదు. 'యూరియాతో సహా ఎరువులన్నీ డిమాండ్‌కు సరిపడా నిల్వ లున్నాయి. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు' అంటూ అధికారులు చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదు. కొన్ని చోట్ల మాత్రం పలుకుబడి ఉన్న రైతులకు మాత్రమే కావాల్సినన్ని ఎరువులు దక్కుతున్నాయి. మిగతా రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికే వరి నార్లు పోసి 20 రోజులవుతున్నా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిండితిప్పలు మానుకుని పగలంతా రైతు సేవా కేంద్రాలు, సహకార సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నా.. ఒకటి, రెండు బస్తాలకు మించి యూరియా దొరకడం లేదు. మరోవైపు కంటి తుడుపు చర్యగా అధికారులు రంగంలోకి దిగి దుకాణాల తనిఖీలకు తెర తీశారు. దీంతోనైనా రైతులకు యూరియా దక్కాలని కోరుకుందాం. – వెలుగోడు

● అన్నదాతకు దక్కని యూరియా

● **వెలుగోడులో..**



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

యూరియా కొరత నేపథ్యంలో అధికారులు సోమవారం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వెలుగోడు తహసీల్దార్ శ్రీనివాసగౌడు, ఏఓ స్వాతి, ఎస్‌ఐ సురేష్‌ల బృందం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. డీలర్ టీబీటీ, ఫిజికల్ బ్యాలెన్స్‌లను తనిఖీ చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్టాకును తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ, ఏఓ, ఎస్‌ఐ

● **జూపాడుబంగ్లా:** యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఏఓ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ గోపికృష్ణ, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం వారు 80 బన్నూరు సహకార సొసైటీని తనిఖీ చేశారు. ఇప్పటిదాకా సొసైటీకి మంజూరైన యూరియా, ఎరువుల స్టాకు వివరాలు, ప్రస్తుతం గోదాములో నిల్వ ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. మన గ్రోమోర్ సెంటర్, ఎరువుల దుకాణాల్లో యూరియాను అక్రమంగా, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

● **పాములపాడులో..**

పాములపాడు: మండల కేంద్రంలోని సుమంత్ ట్రేడర్స్, సాయి వెంకటేశ్వర ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి మహేశ్వర రెడ్డి, ఎస్‌ఐ సురేష్‌బాబు తనిఖీ చేశారు. ఎరువులు నిల్వ ఉంచిన గోదాములు, లైసెన్స్‌లు, స్టాక్ రిజిష్టర్‌లు పరిశీలించారు. నిల్వ ఉన్న ఎరువులు ఈ పాస్‌కు సరి చూశారు.



ఎరువుల దుకాణంలో రిజిష్టర్‌లు పరిశీలిస్తున్న మండల అధికారుల బృందం



సహకార సొసైటీలో ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న ఏఓ, పోలీసులు

● **పగిడ్యాల:** మండలకేంద్రంలోని ప్రాథమిక సహకారసొసైటీ, మల్లికార్జున, శ్రీలక్ష్మీ ఎరువుల దుకాణాలను ఏఓ మురళీధర్, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఓబులేసు, రెవెన్యూ సిబ్బంది సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా రసాయనిక ఎరువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎరువుల నిల్వ వివరాలను స్టాక్ బోర్డులో కనపర్చాలని దుకాణాదారులకు సూచించారు. లెక్కల్లో తేడాలొస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎరువుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

మహానందిలో పీసీసీఎఫ్ పూజలు



చలపతిరావుకు ఆశీర్వచనం అందిస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

పాణ్యం: నేత్రదానం చేయడం వల్ల ఇతరులకు వెలుగును ఇచ్చిన వారవుతారని పాణ్యం సీహెచ్‌సీ డాక్టర్ వేణుగోపాలక్రిష్ణ, మద్దూర్ పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్ అన్నారు. సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని పేర్కొన్నారు. అలాగే నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారన్నారు. నేత్రదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోరాదన్నారు. అనంతరం రెండు ఆస్పత్రుల వద్ద ర్యాలీ నిర్వహించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బండి ఆత్మకూరు: వినాయక ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ రామకృష్ణవేణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **పాములపాడు:** వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. యాప్‌లో రిజిష్టర్ చేయించాలని సూచించారు. మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

● **జూపాడుబంగ్లా:** వినాయక చవితి వేడుకలను



మాట్లాడుతున్న ఎస్‌ఐ జగన్మోహన్

ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మల్లికార్జున, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మైనార్టీ ఆవాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలి

శ్రీశైలం ప్రాజెక్టు: శ్రీశైలం మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేయాబోతున్న మార్కాపురం జిల్లాలో కలపాలని అఖిలపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టులోని స్వామిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. శ్రీశైలం మండలం భౌగోళిక పరంగా కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాకు 180 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఏదైనా ప్రభుత్వ కార్యకలాపాల కోసం, ఆసుపత్రి, విద్య తదితర సదుపాయాల కోసం ఇక్కడ ప్రజలు వెళ్లి రావాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. శ్రీశైలం నుంచి దోర్నాల ఆత్మకూరు వరకు సుమారు 110 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు ఉండడంతో అత్యవసర సమయాల్లో ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఇక్కడి ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వం మార్కాపురం జిల్లా చేస్తే శ్రీశైలం మండలంలోని శ్రీశైలం, సున్నిపెంట, లింగాల గట్టు గ్రామాలను ప్రకాశం జిల్లాలో కలపాలని, మార్కా



మాట్లాడుతున్న నేతలు

పురం జిల్లా పేరుకు బదులు శ్రీశైలం జిల్లా పేరును ఖరారు చేయాలని కోరారు. డిమాండ్లపై తీర్మానం చేసి, కాపీని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నేతలు వట్టి వెంకటరెడ్డి, థానీయేలు, ఏఐటీయూసీ నాయకులు కే.నాగిరెడ్డి, పులిరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు కే.కోటేశ్వరరావు, మద్దిలేటి, దేవదాసు మర్చెంట్ అసోసియేషన్ నాయకులు కొత్త వెంకటేశ్వరరావు, చల్లా కిశోర్, గెల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అడవి జంతువుల నుంచి పైర్లను కాపాడాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘంనాయకులు

నంద్యాల(న్యూటౌన్): అడవి జంతువుల నుంచి పైర్లను కాపాడాలని నల్లమల ఫారెస్ట్ వెంట రక్షణ వలయం నిర్మించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అటవీ సమీప ప్రాంతాలైన కొత్తపల్లి, ఆత్మకూరు, మహానంది, రుద్రవరం, చాగలమర్రి, కొలిమిగుండ్ల మండలాల్లో రైతాంగం సాగు చేసుకున్న మొక్కజొన్న, మినుము, వరి, వేరుశనగ లాంటి పంటలను అడవి పందులు నష్టం కలుగజేస్తున్నాయన్నారు. దిగుబడి సరిగా రాక గిట్టుబాటు ధర లేక ఇప్పటికే రైతాంగం ఇబ్బందులు పడుతోందన్నారు. జిల్లా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగినప్పుడు గతంలో నిర్ణయించిన సొమ్ము కాకుండా ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలన్నారు.

28న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా చెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ రాజేష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ వేర్వేరు విభాగాల్లో చెస్ పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27న ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు సెల్ 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 14 మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. గ్రామం వద్దనున్న పొలాల్లో వివిధ గ్రామాలకు చెందిన పేకాటరాయిల్లు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. సుధాకర్, మునీర్, మొగల్ బేగ్, కృష్ణారెడ్డి తో పాటు మరో 11 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.వారి నుంచి రూ.36,500 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రెపిల్లలు

ప్యాపిలి: అలేబాదుతండా సమీపంలో సోమవారం కుక్కల దాడిలో గొర్రెపిల్లలు, మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన రవీంద్రనాయక్ 20 గొర్రె పిల్లలను, 10 మేక పిల్లలను గ్రామ శివారులోని తన పశువుల పాకలో ఉంచాడు. ఎవరూ లేని సమయంలో పాకలోకి ప్రవేశించిన కుక్కలు..గొర్రె, మేక పిల్లలపై దాడి చేశాయి. జీవాల మృతితో తనకు రూ. 1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

ఆత్మకూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ సభ్యులు, సహకార సొసైటీ సంఘాల కమిటీ చైర్మన్‌లు, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా వెంకటక్రిష్టారెడ్డి, సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా షావుద్దీన్‌తోపాటు ఆరు సహకార సంఘాల చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం చేపట్టారు. అంతకుముందు నంద్యాల టర్నింగ్ నుంచి మార్కెట్ యార్డు వరకు ట్రాక్టర్ల ద్వారార్యాలీ నిర్వహించి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొనసాగించారు.

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం, గోపవరం సొసైటీ చైర్మన్లుగా వెంకటరంగయ్య, ఉమా మహేశ్వరరెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు. వీరితో పాటు డైరెక్టర్లుగా అల్లినగరం ఈశ్వరయ్య, తమ్మడపల్లె రామపుల్లయ్య, సంపంగి సుబ్బయ్య, వంగల లక్ష్మీరెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీటీసీ సభ్యురాలు మల్లెల సుమలత భర్త మల్లెల మల్లికార్జున(40) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ లాలం రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం గుంతకందాల గ్రామానికి చేరుకుని మల్లికార్జున మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వివాహిత అదృశ్యం

మహానంది: అల్లినగరం గ్రామానికి చెందిన వివాహిత శివలలిత అదృశ్యమైంది. ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపిన వివరాలు.. తేళ్లపూరి గ్రామానికి చెందిన నాగేషుతో పదేళ్ల క్రితం శివలలితకు వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగు నెలల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉండటంతో శివలలిత తల్లి సాలమ్మ వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి తన బిడ్డ కనిపించడం లేదని తల్లి సాలమ్మ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

నందికొట్కూరు: వేర్వేరు ప్రమాదాల్లో పట్టణానికి చెందిన ఇద్దరు ఆదివారం రాత్రి మృతిచెందారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు.. స్థానిక ఏబీఎం పాలెంకు చెందిన కాటేపోగు చిన్న స్వాములు(68) సిమెంట్ ట్రాక్టర్‌పై నుంచి కింద పడి గాయాలకు గురయ్యారు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య సులోచనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఐస్‌క్రీమ్ బండి కింద పడి..

అల్లూరు గ్రామం నుంచి చీకటి పడిన తర్వాత నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్‌లోని నివాసం ఉంటున్న ఇంటికి కమల్ కుమార్(39) బయల్దేరాడు. మార్గ మధ్యలో ఐస్‌క్రీమ్ బండితో పాటు కిందపడి గాయాలతో అల్లాడుతున్న వ్యక్తిని ప్రయాణికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కన్నోల్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బయోమెట్రిక్ హాజరు వేయండి

పగిడ్యాల: సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆదేశించారు. సోమవారం అన్ని గ్రామసచివాలయాల ఉద్యోగులకు ఉత్తర్వులు జారీచేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపు

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం పరిధిలోని పెద్దసత్రం, పాన్నూరు సత్రం, శివసదనం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగించాలని దేవస్థానం నిర్ణయించింది. సోమవారం ఆయా ప్రదేశాల్లో ఉన్న నిర్వాసితులకు దేవస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ భవనాలు ప్రస్తుతం నివాసయోగ్యం కావని రహదారులు–భవనాలు, పంచాయితీరాజ్ శాఖల సాంకేతిక నిపుణులు దేవస్థానానికి ఇప్పటికే తెలియజేశారు. నెలలోగా నిర్వాసితులు ఖాళీ చేయాలని లిఖితపూర్వకమైన నోటీసులు జారీ చేశారు. నిర్వాసితులు దేవస్థానానికి సహకరించాలన్నారు.

శ్మశాన వాటిక విషయంలో తొందరపాటు వద్దు

జూపాడుబంగ్లా: కోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు శ్మశానవాటిక విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తగదని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం 80 బన్నూరు గ్రామానికి చెందిన కొక్కరంచ మార్తమ్మ మృతిచెందగా కోర్టులో ఉన్న సర్వే నంబర్ 126ఏలోని భూమిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయమై గ్రామస్తులతో అధికారులు సమావేశమై వివరణ కోరారు. 126ఏ సర్వేనెంబర్‌లో 2.20 ఎకరాల పొలం ఉండగా అందులో 1.20సెంట్లకు మాత్రమే కోర్టు స్టేటస్‌కో విధించిందని, మిగతా 0.90 సెంట్ల స్థలంలోనైనా అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు అనుమతినివ్వాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కోర్టు ఉత్తర్వులు వెలువరించే వరకు వివాదాస్పద స్థలంలో అంత్యక్రియల న నిర్వహణకు తాము అనుమ



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

తులు ఇవ్వలేమని అధికారులు చెప్పగా.. అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే వివాదాస్పద స్థలంలో పంట సాగు చేశారని గ్రామస్తులు అధికారుల దృష్టికి తెచ్చారు. విచారించి చర్యలు తీసుకుంటామని, అప్పటిదాకా తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, ఆదేశాలు లెక్కచేయకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ బస్సు మొరాయింపు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బండి ఆత్మకూరు: మోడల్ స్కూల్ విద్యార్థుల బస్ తరచూ మొరాయిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడూ ఉదయం, సాయంత్రం బస్సు మార్గమధ్యలో ఆగిపోతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం సాయంత్రం కూడా బస్ ఇంజిన్ స్టార్ట్ కాలేదు. విద్యార్థులందరూ కలిసి ముందుకు తోసినా ఫలితం లేకపోయింది. దీంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మరో విద్యార్థి బస్సు విద్యార్థులను వదిలి తిరిగి వచ్చి వీరిని ఎక్కించుకుని గమ్యస్థానాలకు చేర్చింది. కాగా



ముందుకు కదలని మోడల్ స్కూల్ బస్సు

విద్యార్థులు ఇళ్లకు చేరే లోపు చీకటి పడటంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి బస్సులను కండీషన్‌లో ఉంచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచమఠాల్లో విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాల్లో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అన్ని మఠాల్లో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.



పూజలందుకున్న స్వామివారు

రైలు కింద పడి బలవన్మరణం

కర్నూలు: కర్నూలు శివారులోని లాల్‌బహదూర్ శాస్త్రి నగర్‌లో నివాసముంటున్న నరేష్ కుమార్ (45) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొద్ది రోజులు హోటల్ నిర్వహించాడు. అనారోగ్యంతో కొన్నాళ్ల నుంచి హోటల్ మూసేశాడు. దీంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం తుంగభద్ర నది సమీపంలో కర్నూలు నుంచి అలంపూర్ వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (హాస్పిటల్): కాళ్లకు వెరికోసిల్ వెయిన్స్ వ్యాధి సోకడంతో విరక్తిచెంది అంగడి శివకుమార్ (37) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పత్తికొండకు చెందిన ఈయనకు ఆదోనికి చెందిన శ్వేతతో వివాహమైంది. వీరు కర్నూలులోని మద్దూర్ నగర్‌లో నివాసముంటున్నారు. శివకుమార్ మూడేళ్లుగా ఈ వ్యాధితో బాధ పడుతున్నాడు. రెండు కాళ్లకు సమస్య ఉండటంతో నడవలేకపోతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఇనుప కొక్కేనికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై భార్య శ్వేత మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.